క్లుప్తంగా

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం



వైఎస్సార్‌సీపీలో చేరిన ఆర్లబండ నాయకులకు కండువాలు వేస్తున్న మురళీమోహన్ రెడ్డి

కోసిగి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి కోరారు. ఆయన గురువారం స్థానిక కడాపాళెం ఎస్సీ కాలనీ, మారెమ్మ ఆలయం, కాళమ్మగడ్డ, కోత్తపేట వీధులలో మండల నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. సీఎం జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగనన్నకు పట్టం కట్టాలని కోరారు. ఎంపీపీ ఈరన్న, బెట్టనగౌడ్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కోసిగి: మండల పరిధిలోని ఆర్లబండ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు కురువ భాను ప్రకాష్‌తో పాటు మరో 20 కుటుంబాలు పెద్ద కడబూరు మాజీ ఎంపీపీ రఘురాం ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. గురువారం ఆర్లబండ గ్రామంలో ప్రచారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరగా ఆయన కండువాలు వేసి ఆహ్వానించారు.

టీడీపీ హామీలు నమ్మి మోసపోవద్దు



ఎమ్మిగనూరులో ప్రచారం చేస్తున్న బుట్టా సాహితి

ఎమ్మిగనూరుటౌన్: అమలు సాధ్యం కాని హామీలతో టీడీపీ విడుదల చేసిన మేనిఫేస్టోను నమ్మి మోసపోవద్దని, అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు బుట్టా సాహితి పేర్కొన్నారు.. గురువారం పట్టణంలోని 19వ వార్డులో రాష్ట్ర కుర్ణికరికల కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదమ్మ, వార్డు ఇన్‌చార్జ్ యూకే వీరేంద్రతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వలంటీర్ల రాజీనామా

కౌతాళం: వలంటీర్ వ్యవస్థపై టీడీపీ, జనసేన పార్టీల అనుచిత వ్యాఖ్యలతో పాటు ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకుని ప్రజాసేవకు దూరం చేయడంతో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తాజాగా చిరుతపల్లి గ్రామానికి చెందిన వలంటీర్లు 8 మంది, సుళేకేరి గ్రామానికి చెందిన ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేశారు. వీరి రాజీనామా పత్రాలను ఉన్నతాధికారులకు పంపుతామని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఆదోని అర్బన్: ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. ఈ మేరకు గురువారం రాత్రి 8 గంటల సమయంలో పట్టణంలోని ఇందిరానగర్ రామాలయం వద్ద ప్రజలకు ఎన్నికల నియామవళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా గొడవలు, అల్లర్లు సృష్టించినా, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. పట్టణ ఎంసీసీ టీం ఇన్‌చార్జ్ అనుపమ, టూటౌన్ సీఐ గోపి, బీఎల్‌ఓలు, అధికారులు పాల్గొన్నారు.

మేలు చేసే వారికి పట్టం కట్టాలి



మంత్రాలయంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

మంత్రాలయం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఎంతో శ్రమించారని, మేలును చూసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రియాంకరెడ్డి, వీణారెడ్డి, అనూషారెడ్డి, మమతారెడ్డి మంత్రాలయంలోని పాతూరులో పర్యటించారు. గడప గడపకు వెళ్లి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను అఖండ మెజారిటీతో కల్పించాలని కోరారు. మంచి చేసే వాళ్లకే పట్టం కట్టాలని విన్నవించారు. సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, నాయకులు మల్లికార్జున, వెంకటేష్‌శెట్టి, శీను, రాఘవేంద్రాచారి, శివ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే ఆదోని అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: జగనన్న ఐదేళ్ల పాలనలోనే ఆదోని ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. నవరత్నాల పథకాల ద్వారా కోట్లాది రూపాయలు ప్రజలకు లబ్ధి చేకూరిందని వివరించారు. నాడు–నేడు, 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో సందుసందునా, గల్లిగల్లిలో మురుగు కాలువలు, సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే గురువారం ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కౌన్సిలర్లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 20, 21వ వార్డులు, 41వ వార్డుల్లో పర్యటించారు. ప్రచార రథంపైనుంచి ప్రసంగించారు. రోజురోజుకు వైఎస్సార్‌సీపీ బలం పెరుగుతోందని, ఫ్యాన్ గాలి దాటికి ప్రతిపక్షాలన్నీ కొట్టుకుపోతాయన్నారు. బీజేపీ అభ్యర్థి పార్థసారథి వైఎస్సార్‌సీపీ నాయకులపై విమర్శలు చేస్తే ఓట్లు పడతాయన్న భ్రమలో ఉన్నాడన్నారు. ఆదోని ప్రజలు తెలివైనవారని అభివృద్ధికి పాటుపడే నాయకుడిని ఎన్నుకుంటారని స్పష్టం చేశారు. ఈనెల 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి నాయకుల మోసపూరిత హామీలను నమ్మవద్దన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి



క్రాంతినగర్‌లో ప్రచారం చేస్తున్న మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా సాయిప్రసాద్‌రెడ్డిని మరోమారు గెలిపించుకుందామని యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి ఓటర్లను విన్నవించారు. గురువారం పట్టణంలోని 20, 24, 25 వార్డుల పరిధిలో మనోజ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి హిరణ్మయిరెడ్డి, ఎమ్మెల్యే కుమార్తెలు మనోవిద్యారెడ్డి, గౌతమిరెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఐదేళ్ల పాలనలో ప్రతిఒక్కరికీ మేలు చేసిన ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కూటమి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీకి చరమగీతం తప్పదు



విద్యానగర్ తండాలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు టీడీపీకి చరమగీతం పాడబోతున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం మంత్రాలయం మండలంలోని విద్యానగర్ తండా, మాలపల్లి, సాలహళ్లి, సుంకేశ్వరి, రచ్చుమర్రి, చెట్నిహళ్లి, సూగూరు గ్రామాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగనన్న పాలనపై రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోలో ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఆయన మాట మీద నిలబడే వ్యక్తి కాదని ప్రజలకు బాగా తెలుసన్నారు. జగనన్న నవరత్నాల పథకాలు తమకు విజయాన్ని అందిస్తాయని దీమా వ్యక్తం చేశారు. టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి కుటుంబాన్ని తాము ఎంతగా చేరదీసినా కృతజ్ఞత లేకపోయిందని, వాళ్ల నాన్నను అవమానపరిచిన టీడీపీలోకి వెళ్లి టిక్కెట్ తెచ్చుకున్నారన్నారు. అవగాహన రాహిత్యంతో తమపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని హితవుపలికారు. ప్రజల ఆశీస్సులతో నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న తండా పడచుల నృత్య ప్రదర్శన

తమ అభిమాన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గ్రామానికి ప్రచారానికి రావడంతో విద్యానగర్ తండావాసులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ జెండాలను చేతబూని సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఊరంతా పండగ వాతావరణం తలపించేలా ప్రచారంలో పాల్గొని అభిమానాన్ని చాటుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారిని ప్రచార ఘట్టం విశేషంగా ఆకట్టుకుంది. పార్టీ మండల కన్వీనర్ భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు గురురాజారావు, సత్య, మధుసూదన్‌రెడ్డి, రోగప్ప, బొజ్జప్ప, రవిరెడ్డి, సర్పంచులు సీతారామిరెడ్డి, విజయభారతి, ముక్కరన్న, లక్ష్మయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జెండాలతో తండా వాసుల సంప్రదాయ నృత్యం

నమ్మకానికి నిదర్శనం సీఎం జగన్



ఎన్నెకండ్లలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న బుట్టా ప్రతుల్

గోనెగండ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయాల్లో నిజాయితీకి, నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బుట్టా ప్రతుల్ అన్నారు. ఆయన గురువారం మండలంలోని ఎన్నెకండ్ల, ఐరన్‌బండ గ్రామాలు, సాయంత్రం కులుమాల గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై ప్రజల్లో అపార నమ్మకం కలిగిందన్నారు. 2024 మేనిఫెస్టోలో చేయగలిగే హామీలను మాత్రమే పేర్కొన్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. నాయకులు బందె నవాజ్, దొరబాబు, కాశీరెడ్డి, వీరారెడ్డి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈరన్న స్వామికి వెండి విరాళం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామికి గురువారం భక్తులు వెండిని విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ వాస్తవ్యులు ఆదెప్ప వారి కుటుంబసభ్యులు 750 గ్రాముల వెండి వస్తువులను దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫోటోను అందజేశారు.

టీడీపీ వ్యాఖ్యలు హాస్యాస్పదం

కోసిగి: మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి ఎన్నికల ప్రచారంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలపై అవగాహన లేకుండా మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు గురువారం కోసిగిలో మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కందుకూరు గ్రామానికి టీడీపీ హయాంలో లిఫ్ట్ ఇరిగేషన్ వచ్చిందని చెప్పుకుంటున్న రాఘవేంద్ర రెడ్డి ఆధారాలు ఉంటే చూపించాలని నిలదీశారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సీఎం వైఎస్ జగనన్నతో కలిసి నియోజకవర్గానికి 5 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు తీసుకొచ్చారని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎంపీపీ ఈరన్న, పార్టీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, నాడుగేని నాగరాజు, శ్రీనివాస రెడ్డి, మహంతేష్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

87 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీఓ విజయశేఖర్‌రావుకు అందిస్తున్న వలంటీర్లు

ఆదోని రూరల్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 87 మంది వలంటీర్లు గురువారం విధులకు రాజీనామాలు చేస్తూ పత్రాలను ఎంపీడీఓ విజయశేఖర్‌రావు, ఈఓపీఆర్‌డీ నాగరాజుకు అందజేశారు. పెద్దతుంబళం సచివాలయం–1 పరిధిలో 17 మంది, పెద్దతుబళం–2 సచివాలయం పరిధిలో 19 మంది, పెద్దహరివాణం–1 పరిధిలో 13 మంది, పెద్దహరివాణం–2 పరిధిలో 9 మంది, మదిరె–1 పరిధిలో 9 మంది, మదిరె–2 పరిధిలో 9 మంది, నాగలాపురంలో 2, జాలిమంచిలో 1, బసరకోడు సచివాలయం పరిధిలో 8 మంది రాజీనామాలు చేసినట్లు ఎంపీడీఓ చెప్పారు.

ఆదోనిలో 70 మంది రాజీనామా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో 70 మంది వార్డు వలంటీర్లు గురువారం విధులకు రాజీనామా చేశారు. వివిధ వార్డులకు చెందిన వలంటీర్లు రాజీనామా చేస్తూ వార్డు అడ్మిన్‌లకు పత్రాలను సమర్పించారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల భవిష్యత్తు



కడివెళ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ఎమ్మిగనూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పేర్కొన్నారు. ఆమె గురువారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ బీఆర్.బసిరెడ్డి, వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్‌తో కలసి మండల పరిధిలోని కందనాతి, కడివెళ్ల, ఏనుగుబాల, దైవందిన్నె, సోగనూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మద్దతుతో మీ ముందుకు వచ్చానని, ఆదరిస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, ఆయన పాలనలో మంచి జరిగి ఉంటే ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

చంద్రబాబు మేనిఫెస్టో బూటకం

టీడీపీ అధినేత చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టో బూటకమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి అన్నారు. గతంలో రైతులు, డ్వాక్రా సంఘాలకు రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారని గుర్తుచేశారు. అప్పులు తెచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, రాష్ట్రాన్ని శ్రీలంకగా మారుస్తున్నారని జగనన్నను విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు అంతకుమించి హామీలు ఎలా ఇస్తున్నారని, వాటన్నింటిని ఎలా అమలుచేస్తారో చెప్పాలన్నారు. సీఎం జగన్‌ను తిట్టడమే పనిగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు, పలు టీవీ చానళ్లు, ఈనాడు, ఆంధ్రజ్యోతి పనిగా పెట్టుకున్నాయన్నారు. ఎమ్మెల్యేగా బుట్టా రేణుకను భారీ మెజార్టీతో గెలిపిస్తే మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తుందని చెప్పారు.

జగనన్న మాటిస్తే నెరవేరుస్తారు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కసారి మాట ఇస్తే నెరవేరుస్తారని సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చి ఇప్పుడు మరిన్ని సంక్షేమ పథకాలతో మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించుకుంటే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ కేశన్న, భీమిరెడ్డి, రామకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రంగస్వామి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో బీజేపీకి చెందిన 20 కుటుంబాలు గురువారం బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. బీజేపీ మండల ప్రధాన క్యాదర్శి విజయ మోహన్, యోహాన్, ప్రకాశం, శాంతన్న, రాజన్న, అన్నమ్మ, శోభరాణి, ఆనందమ్మలతో పాటు మరి కొందరికి ఆమె పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.



బీజేపీ మండల కార్యదర్శి విజయమోహన్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న బుట్టా రేణుక

జగనన్నతోనే ప్రజా సంక్షేమం



కంబలదిన్నిలో ప్రచారం చేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: సార్వత్రిక ఎన్నికల్లో జగనన్న గెలుపే పేదల విజయంగా భావించి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన గురువారం కంబలదిన్ని గ్రామంలో సర్పంచ్ తిమ్మక్క ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం చేశారు. సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డికి, ఎంపీ అభ్యర్థి బీ.వై రామయ్యకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు పురుషోత్తంరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గుడిసె శివన్న, ముక్కరన్న, అర్లప్ప, ఆంజనేయ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో పడిగాపులు కాస్తున్న వృద్ధులు



గోనెగండ్లలో ఖాతాదారుల సేవ కేంద్రం వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న పింఛన్ దారులు

చంద్రబాబు ఏడి'పింఛన్'

రాష్ట్రంలో రెండు నెలలుగా పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ప్రతిపక్ష నేత చంద్రబాబు కుట్రపూరితంగా ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టుకుని వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరం చేయడంతో వృద్ధులు, దివ్యాంగుల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. చంద్రబాబు క్షుద్ర రాజకీయాలకు గత నెలలో పింఛను కోసం మండుటెండలో కార్యాలయాలకు వెళ్లి రాష్ట్రవ్యాప్తంగా 31 మంది మృత్యువాతపడిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి మే నెల పింఛను సొమ్మును డీబీటీ ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. మంచానికి పరిమితమైన వృద్ధులు దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే పింఛను అందించే ఏర్పాటు చేసింది. దీంతో లబ్ధిదారులు మండుటెండలో బ్యాంకుల వద్దకు పోటెత్తుతున్నారు.కురువృద్ధులు, దివ్యాంగులు మరొకరి సాయంతో బ్యాంకుల వద్దకు చేరుకుని పడిగాపులు కాస్తూ తమ వంతు వచ్చినప్పుడు నగదు అందుకుంటున్నారు. జగనన్న పాలనలో తమకు 58 నెలలుగా ఇంటి వద్దనే పింఛన్ అందించారని, ఇప్పుడు చంద్రబాబు కుట్రతో మండుటెండలో అవస్థలు పడాల్సివస్తోందని వాపోయారు. పండుటాకులపై చంద్రబాబుకు ఎందుకంత పగ అంటూ ప్రశ్నిస్తున్నారు. శాపనార్థాలు పెడుతూ తమను ఇబ్బందులకు గురిచేసిన ఆయనకు ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఆదోనిలో ఎస్‌బీఐ సేవా కేంద్రం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు



కోసిగి ఎస్‌బీఐ ముందు వేచి ఉన్న పింఛన్‌దారులు



కౌతాళం స్టేట్ బ్యాంకులో విత్‌డ్రా ఫారం రాసి ఇస్తున్న సిబ్బంది

మరొకరి సాయంతో వచ్చా..



నేను కోసిగిలోని 4వ వార్డులో నివాసం ఉంటున్నా. పింఛన్ సొమ్మే జీవనాధారం, నెలంతా ఖర్చులకు పనికొస్తుంది. పింఛను కోసం పోయిన నెల సచివాలయం అని, ఈ నెల బ్యాంకుకు వెళ్లమని తిప్పుతున్నారు. వయసు పైబడిన నేను చెల్లెలి సాయంతో అవస్థలు పడుతూ ఇక్కడి దాకా వచ్చాను. ఇంటి వద్దకే పింఛన్ ఇచ్చేలా చూడాలి.

– హనుమంతమ్మ, కోసిగి

ఇంత కష్టపెట్టారు



ఉదయాన్నే వలంటీర్లు వచ్చి పింఛన్ ఇచ్చేవారు. గతనెల సచివాలయం, ఈనెల బ్యాంకుకు రాక తప్పలేదు. నాకు సరిగా నడవడానికి కూడా రాదు. మాలాంటి వృద్ధులు ఎంతోమంది ఇలా బాధ పడుతున్నాం. మంచి జరిగేదాన్ని తప్పుబట్టి రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదు. వలంటీర్ వ్యవస్థతో ఎంతో సంతోషంగా ఉదయాన్నే పింఛన్ తీసుకునేవాళ్లం.

– చిన్నమారెన్న, ఆర్టీసీ కాలనీ, ఆదోని

వైఎస్సార్‌సీపీలోకి చేరికల వెల్లువ



వైఎస్సార్‌సీపీలో చేరిన కనకవీడు పేట టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన గోనెగండ్ల బీజేపీ నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



వైఎస్సార్‌సీపీలో చేరిన ఎమ్మిగనూరు జనసేన, బీజేపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కార్యకర్తలు గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక, పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా యుగంధర్ సమక్షంలో వందలాదిగా వైఎస్సార్‌సీపీలో చేరారు.

- గోనెగండ్ల మాజీ ఎంపీటీసీ కృష్ణమూర్తి నాయుడు, బీజేపీ మండలాధ్యక్షుడు సుధాకర్‌నాయుడుతో పాటు 600 మందికిపైగా కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.
- ఎమ్మిగనూరులో జనసేన పార్టీ చేనేత రాష్ట్ర కార్యదర్శి మాదుగుండు శివ, బీజేపీ నాయకుడు బండ రవి కుమార్‌లతో పాటు 300 వైఎస్సార్‌సీపీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన పెద్దమరివీడు బీజేపీ కార్యకర్తలు

- గోనెగండ్ల టైలర్స్ అసోసియేషన్ నాయకులు కె.నరసింహులు, కొండల ఖాశిం, జయలక్ష్మి, సుజాతతో పాటు 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ పంచన చేరాయి. అలాగే నందవరం మండలం కనకవీడుపేట టీడీపీకి చెందిన పేట రాఘవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, లోకన్న, రామప్ప, బీజేపీకి చెందిన కల్లు లింగన్న, వీరేష్, బోయ గురు వైఎస్సార్‌సీపీలో చేరారు.



వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న గోనెగండ్ల టైలర్స్ అసోసియేషన్ సభ్యులు

- పెద్దమరివీడు బీజేపీ నాయకుడు దస్తగిరి ఆధ్వర్యంలో వంద మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన కార్యకర్తలు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని, ప్రతిఒక్కరికీ అండగా ఉంటామని అభ్యర్థి బుట్టా రేణక భరోసా ఇచ్చారు.

బీజేపీ అభ్యర్థిపై ఫిర్యాదు



త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు పత్రం ఇస్తున్న కృష్ణమోహన్

ఆదోని అర్బన్: బీజేపీ అభ్యర్థి పార్థసారథిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కొడల్‌పేట వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణమోహన్ గురువారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం కొడల్‌పేటలో పార్థసారథి ప్రచారంలో తనపై తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. ఆలూరు రోడ్డులో జగనన్న కాలనీ కోసం తాను 150 ఎకరాలు ఇప్పించానని, అందుకు ఒక్కో రైతు నుంచి రూ.1.50 లక్షలు తీసుకున్నట్లు ఆరోపించారన్నారు. ఎవరో స్క్రిప్టు రాసిస్తే నిజానిజాలు తెలుసుకోకుండా ప్రజల మధ్య ఆరోపణలు చేయడంతో తన పరువుకు భంగం కలిగిందని, తీవ్ర మనోవేదనకు గుర్తైనట్లు పేర్కొన్నారు. వెంటనే పార్థసారథిపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, నాయకులు వై.పి.లక్ష్మన్న, కోదండ, రవి, వీరేష్, శేఖర్ పాల్గొన్నారు. ఈ విషయంపై త్రీటౌన్ సీఐ నరసింహరాజును వివరణ కోరగా ఎన్నికల కోడ్ ఉన్నందున ఆర్‌ఓకు ఫిర్యాదు చేయాలని, తమ బాధ్యతగా విచారణ చేస్తామని చెప్పారు.